# మిసిమి

A Telugu Fortnightly సంపుటి 1 సంచిక 4



10-4-1990

# మిసిమి

**MISIMI**

(A Telugu Fortnightly)

సంచిక 4 | 10-4-1990 | సంపుటి 1


## విషయసూచిక


1. ఇండియాకు జపాన్‌కు రాజకీయాలలో పోలికలు, పోకళ్ళు

— యం.వి. రామమూర్తి

2. తెలుగులోకి అనువాదాలు

— డా. ఎన్. ఇన్నయ్య

3. వరివస్య (అబ్బూరి సంస్మరణ)

— శ్రీ స.చ. రామానుజాచార్యులు


ఒక రూపాయి

# ఇండియాకు జపాన్‌కు రాజకీయాలలో పోలికలు, పోకళ్ళు

శ్రీ యం.వి. రామమూర్తి

[ మన రెండు దేశాలలో రాజకీయ వాదులను చూస్తుంటే రక్త సంబంధీకులయిన ఒక కులీన వర్గం అవతరిస్తుందా అనే భయాందోళనలు పొడసూపుతాయి.]

78 సంవత్సరాల మాజీ విదేశాంగ మంత్రి జెంటారో కొసకా ఎన్నికలలో పోటీ చేయదలచలేదు. అయినా 2000 మందున్న ఎన్నికల సభలో అతడు ఉపన్యసిస్తున్నాడు. అతని శిరస్సు చుట్టూ చుట్ట బడిన వస్త్రముపై 'విజయం' అనే అక్షరాలతో కూడిన పదం కనిపిస్తున్నది. ఇంత కాలం తనను బలపరిచినందుకు ప్రజలకు తన కృతజ్ఞతను తెలుపుతున్నాడు. అతని ఉపన్యాసం ఇలా సాగుతున్నది, ''నా శక్తి సామర్థ్యాలను ఈ పట్టణ పురోభివృద్ధికి ధారపోసాను. అయితే ఈ పట్టణాన్ని ఇంకెంతో బాగు చేయవలసి వుంది'' ఎవరు ఈ కృషిని కొనసాగించగలరో అతడు సూచించ పూనుకున్నాడు. ''దయయుంచి కైజీని ఆ పనిలో మీతో కలసి పని చేయనివ్వండి.''

అతనెవరో కాదు తన పుత్రరత్నం. తన కుమారుని అభ్యర్థిత్వాన్ని బలపరచటం ద్వారా కుటుంబ సంప్రదాయాన్ని కొనసాగించాలని అతని తాపత్రయం. టోక్స్ నగరానికి ఉత్తరాన ఉన్న పర్వత ప్రాంత నగానో జిల్లాను మూడు తరాలుగా ఒకే కుటుంబం వారు తమ ఆధిపత్యం క్రింద ఉంచుకున్నారు.

చిరకాలం అధికారాన్ని చలాయించిన లిబరల్ డెమోక్రటిక్ పార్టీ వృద్ధనేతలు, పదవీ విరమణ చేస్తున్న తరుణంలో, వారి తండ్రుల అండదండలతో యువకులైన వారి కుమారులు పదవులలోకి జొరబడుతున్నారు. పార్లమెంటు దిగువసభకు 15 ఫిబ్రవరిన ఎన్నికలు జరిగాయి. అందులో 325 స్థానాలకు లిబరల్ పార్టీ పోటీ చేసింది. నెగ్గిన వారిలో 40 శాతం మంది పార్టీ అభ్యర్థులు మాజీ పార్లమెంటు సభ్యుల రక్తసంబంధీకులే.

35 సంవత్సరాలు ఏకధాటిన అధికారంలో ఉన్న లిబరల్ పార్టీ 1989 జూలై నెలలో పార్లమెంటు ఎగువసభలో మెజారిటీని కోల్పోయింది. పార్టీ ప్రమాదంలో పడిపోయింది. అలాంటి పార్టీ పార్లమెంటు దిగువ సభలో తన మెజారిటీని నిలుపుకోగలిగిందా? ప్రభుత్వంపై పెత్తనం కొనసాగించ గల్గిందా? మరో సమస్య ఉత్పన్నమవుతున్నది. జపాను దేశపు రాజకీయాలలో రక్త సంబంధీకుల వ్యవస్థ చోటు చేసుకోపోతున్నదా అనే ప్రశ్న ఉదయిస్తున్నది. రెండో తరపు రక్తసంబంధపు రాజకీయ వాదుల ఉనికి వల్లనే ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నవి.

పార్లమెంటు దిగువసభలో 512 స్థానాలుండగా మూడవ వంతు మంది సభ్యులు పాత సభ్యుల కుటుంబీకులే లేక అల్లుళ్ళు లేక దత్తు కుమారులో అయి ఉంటున్నారు. ఎగువసభలో 252 స్థానాలలో పదవ వంతు ప్రాతినిధ్యం అలాంటి వారికే దక్కింది; ఇంకా మరింత సంఖ్యలో ఉన్న సభ్యులు పాతవారి గోత్రీకులు కాకపోతే వివాహాదుల ద్వారా బంధువులు. ఎన్నికల నాటికి 20 మందున్న కాబినెట్ మంత్రి

వర్గంలో ఆర్గురు పాత పార్లమెంటు సభ్యుల కుమారులు. ఆర్థిమంత్రి రియు తారో హషిమోటో, విదేశాంగమంత్రి తారో నకయానులు అలాంటి వారే. మాజీ ప్రధాన మంత్రి నొబోరు తకేషితా, లిబరల్ పార్టీ అధినేత షిన్‌కానెమారు తమ పిల్లల వివాహాల ద్వారా బందువులు. షింటారో అబే తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని విదేశాంగమంత్రి అయ్యాడు ఒకనాడు. అతడు మాజీ ప్రధానమంత్రి నొబుషూకె కిషీ కుమార్తెను పెళ్ళి చేసుకున్నాడు. మాజీ ప్రధాన మంత్రి తకియో కుమారుడు, మాజీ ప్రధానమంత్రి జెంకో సుజూకీ ఇటీవల ఎన్నికలలో పోటీ చేశారు. తప్పక విజయం సాధిస్తామనే విశ్వాసంతో పోరాడారు.

తండ్రుల అడుగు జాడలలో పయనించడమనేది జపాను దేశంలో బలవత్తరమైన లాభదాయకరమైనదీను. యీ సంప్రదాయం. ఇది భారీ వ్యాపార రంగంలో, కబూకీ నాటక రంగస్థలంలో, సుమో పద్ధతి కుస్తీ రంగంలో యీ అనువంశిక సాంప్రదాయం స్పష్టంగా చాలా కాలంగా పాతుకు పోయింది. కొత్తగా రాజకీయాలలో కూడా ఈ సంప్రదాయం చోటుచేసుకున్నది. నియోజక వర్గాలను పోషించుకోవటానికి ఎంతో ధన వ్యయం చేయవలసి రావడం, ఎంతో కాలం వెచ్చించవలసిన అగత్యం ఏర్పడడం ఈ సంప్రదాయాన్ని బలపరిచాయి.

జపానులోని నియోజక వర్గాల వ్యవస్థను గమనిస్తే ఒక అంశం ద్యోతకమవుతుంది. ఒకే పార్టీయొక్క సభ్యులు ఒకే జిల్లాలో ఒకరినొకరు వ్యతిరేకంగా తారసపడటం కద్దు. క్రొంగొత్త ప్రణాళికలను సూచించటానికి అవకాశం లేక వారు కొత్త రోడ్లను వేయిస్తామని, తమ పట్టణాలలో క్రొత్త ఫ్యాక్టరీలను నెల కొల్పుతామని వాగ్దానాలు చేస్తూ ఎన్నికల ప్రచారం సాగిస్తారు. ఈ వారసత్వ రాజకీయ విధానం వల్ల వారికి 3 లాభాలు చేకూరుతున్నాయి. తార్కాణంగా (1) నియోజక వర్గం సిద్ధంగా దొరుకుతుంది. (2) గుర్తింపు తేలికగా లభిస్తుంది. (3) ఎన్నికల నిధి కోసం తాపత్రయ పడనక్కర లేదు. తాము ప్రజా జీవితంలో ప్రవేశించే తొలి రోజుల్లోనే వీటికోసం ఈ అభ్యర్థులు పాటుపడ నవసరం లేదు. అప్పటికే మంచి పునాదులు వేసి వున్నాయి కనుక.

ఈ వారసత్వ రాజకీయ వ్యవస్థను ప్రస్తుతించే వారు ఇలా చెప్తున్నారు. ''ఈ వారసులకు 40 సంవత్సరాలు వచ్చేటప్పటికి యీ రాజ కుమారులకు విద్య, విధాన, నిర్మాణ, ప్రజ్ఞలు అలవడుతాయి.'' మాజీ రక్షణమంత్రి కోయచీ కాటోను, అలాంటి వారసవర్గ ప్రతినిధిగా పరిగణించ వచ్చు. టోక్యోలోని రికియో విశ్వవిద్యాలయ రాజకీయ శాస్త్ర విభాగపు ఆచార్యులు తన మాటలో యిలా ఉదహరిస్తారు. కోయిచీ విదేశాంగ వ్యవహారాలలో, వ్యవసాయ విషయాలలో ప్రతిభావంతుడుగా పేరు పొందాడు. మాజీ వ్యవసాయ మంత్రి ఇచిరో నకిగావా జపాను లోని ఉత్తరపుదీవి హక్కాయిడో నుండి పార్లమెంటు సభ్యుడిగా వచ్చాడు. అతనిని 'గోధుమ రంగు ఎలుగుబంటి' అని ప్రజలు వెక్కిరింపుగా పిలిచేవారు. అతని రాజకీయ వారసునిగా అతని కుమారుడు షోయిచీ రెండు పర్యాయాలు పార్లమెంటు దిగువ సభ సభ్యుడిగా ఉండి మరల ఇటీవల మూడవసారి పోటీ చేశాడు. అతడు టోక్యో విశ్వ విద్యాలయ పట్టభద్రుడు. జపాను పారిశ్రామిక బ్యాంకులో అధికారి. ఇలా విద్యకు, ప్రావీణ్యతకు, చిహ్నాలుగా వారసులను పేర్కొని వారసత్వ రాజకీయాలను సమర్థించడం సాగుతున్నది.

రాజకీయ వాదుల అసమర్థ సంతానం ఈ రాజకీయ వారసత్వ విధానం వల్ల పార్లమెంటులోకి ప్రవేశించ కలుగుతున్నా రని విమర్శకులు గట్టిగా వాదిస్తున్నారు. మినోరు మోరిటా అనే రాజకీయ వ్యాఖ్యాత మాటల్లో, ''తన స్వయంకృ షితో పైకి వచ్చే రాజకీయ వాదికి కొంత ప్రాథమిక అనుభవమూ, ప్రపంచ జ్ఞానమూ ఉంటాయి. ఈ రాజకీయ వారసులలో అవి మృగ్యం'' జెంటారో కోసకా కూడా అది నిజమే నంటాడు. 'నా అనుభవంలో ఈ వారస రాజకీయ వాదులకు పట్టుదల, కృత నిశ్చయం, లోపిస్తాయి' అని ఆయన అంగీకరించక తప్పలేదు.

'ఈ వారసుల రాజకీయ ప్రవేశం వారికి అనుకూలమైన పరిస్థితులను కల్పి స్తున్నది' అనే భావం బహుళ ప్రచారంలో ఉన్నందున తదితరులు రాజకీయాలలోకి ప్రవేశించడానికి నిరుత్సాహపడుతు న్నారు. కోసకా కుమారునికి వ్యతిరేకంగా పోటీచేసే మసటోషి వకబయాషి ఏమ న్నాడో గమనిద్దాం,'' పార్లమెంటు దిగువ సభలో సగం స్థానాలు రాజకీయ వారసు లతో నిండిపోతే ఒక ప్రత్యేక వర్గం మాత్రమే రాజకీయాలలోకి ప్రవేశించ అర్హులు అనే భావం ప్రజలలో వ్యాపి స్తుంది. తద్వారా ప్రభుత్వంలో సామ ర్థ్యమూ, చైతన్యమూ లోపిస్తాయి. యిలా పల్కిన మసటోషి వక బయాషీ రాజకీ యాలకు క్రొత్తవాడు కాదు. రెండు సార్లు పార్లమెంటు మెంబరు; మూడవసారి పోటీ చేసిన వ్యక్తి, తను మొదట్లో రాజకీ యాల్లోకి ప్రవేశించటానికి భయపడినా డట, కుటుంబ సంబంధాలు లేవే అని సంకోచించాడట. అలా తటపటాయి స్తున్న తనకు తన రాజకీయ గురువు 'అదే నీబలం' అని హెచ్చరించి ప్రోత్స హించాడట. ఈ ఉదాహరణలు వారసత్వ రాజకీయాల వ్యవస్థను తూర్పార పట్టు న్నాయి. జపాను ప్రజలు ఇంత వరకూ ఈ 'గోత్ర' రాజకీయాలను గురించి తీవ్రంగా ఇంత వరకూ పట్టించుకోలేదు. 'ఆపిల్' పండ్లను కాయించే ఒక జపాసు వ్యవసాయదారుడు 40 సంవత్సరాల నుండి జెంటారో కోసకాను బలపరుస్తూ వచ్చాడు. అతడు మొదట్లోనే కోసకా కుమారునికి వోటు వేయటానికి నిర్ణయిం చుకున్నాడు. ఆతను యిలా అంటుం న్నాడు ''అతని తండ్రి కష్టపడి సాధించిన దాన్ని ఆ అభ్యర్థి (కొడుకు) సక్రమంగా వినియోగించ గలడు.'' ఇలాంటి విశ్వాసం ప్రబలంగా ఉంది.

యధాతథ స్థితి కొనసాగాలనే అంధ విశ్వాసం ఇంతకాలం లిబరల్ డెమోక్రా టిక్ పార్టీని అధికారంలో ఉంచింది. నాల్గు తరాల నుండి పార్లమెంటులో ఉన్న ఒక కుటుంబ ప్రతినిధి యూకియో హటో యమ ఎలా వ్యాఖ్యానిస్తున్నాడో తెలుసు కుందాం. ''కుమారుని యెడల విధి, కరుణలతో కూడిన విలువల విధానాన్ని రాజకీయాల్లోకి ప్రవేశపెట్టే నియోజక వర్గాన్ని కుమారునికి వప్పచెప్పటం సంభ విస్తుంది. ఈ పద్ధతి అంత తేలికగా మారదు'' ఏమయినా లిబరల్ పార్టీ ఇలా భావిస్తున్నది.

గత ఎన్నికల ప్రచారంలో ఈ పద్ధతిని మార్చవద్దని లిబరల్ పార్టీ అభ్యర్థులు పదేపదే ప్రజలను హెచ్చరించారు. ప్రధాన మంత్రి టోషి కైపూ ఉపన్యాస సారాం శాన్ని గుర్తు చేసుకుందాం, ''పాత లిబ రల్ పార్టీని ఎన్నుకోవటమా, కొత్తగా పుడావుడిగా ఏర్పడిన ప్రతిపక్షాన్ని ఎన్ను కోవడమా అనే అంశాన్ని గురించి జాగ్ర త్తగా ఆలోచించమని అభ్యర్థిస్తున్నాను'' ఇంతసేపూ పాత పార్టీకే అధికారాన్ని కట్టబెట్టమనే విజ్ఞప్తులే ముమ్మరంగా బలం

పుంజుకుంటు ఉన్నాయి. అందువల్లనే మళ్ళీ జపానులో లిబరల్ పార్టీ అధికారం లోకి వచ్చింది.

గతంలో మంచిగా ఉన్నది భవిష్యత్తులో చెడుగా వుండవచ్చని జపాను ఓటర్లు గ్రహించే వరకు జపానులో రాజకీయాలు కుటుంబ ప్రాబల్య విధానానికే కట్టుబడి ఉంటాయనేది నిర్వివాదాంశం తెచ్చుకోదగ్గ విషయం గనుక, వాటిని తెలుగు

# మరో పోలిక

## లంచాలు పుచ్చుకోని వారు అసమర్థులా? అవినీతి పరులు కాని వారు చేతకానివారా?

యీ మధ్య జపాను పార్లమెంటు దిగువసభకు ఎన్నికలు జరిగాయి. 512 స్థానాల్లో 275 స్థానాలను లిబరల్ డెమోక్రాటిక్ పార్టీ గెలుచుకుంది. ప్రభుత్వం ఏర్పరిచింది. 35 సంవత్సరాల నుండి అధికారంలో ఉన్న రాజకీయ పార్టీకి జపాను ప్రజలు మళ్ళీ పట్టం కట్టారు.

''రిక్రూట్'' అనే జాతీయ కంపెనీలో లోగడ లంచాల సందర్భంగా కళంకానికి లోనయిన అధికారంలో వున్న 16గురు లిబరల్ పార్టీ అభ్యర్థులలో ఇద్దరు తప్ప అందరూ గెలిచారు. మాజీ మంత్రివర్గ కార్యదర్శి శ్రీ తకాయో ఫ్యూజినామి పైన లంచం తీసుకున్నాడనే క్రిమినల్ కేసు పెండింగులో ఉంది. అయినా ఆయనను ప్రజలు ఎన్నుకున్నారు.

ఒక సంవత్సరంలోనే 'రిక్రూట్' లంచాల కళంకాన్ని ప్రజలు మరచిపోయారా? ''చారిత్రాత్మకమైన మతిమరుపుతో జపాను ప్రజలు ప్రవర్తిస్తున్నారా? అనటానికి యిదొక తార్కాణం అంటాడు ఒక జపాను సోషలిష్టు పార్టీ సభ్యుడు.

సోఫియా విశ్వవిద్యాలయపు రాజకీయ శాస్త్రజ్ఞుడి మాటల్లో, ''లంచం తీసుకోని వారు అసమర్థులని, చేతకానివారని జపాను ప్రజల భావం కనుక ఆర్థిక దుష్ప్రవర్తన విషయంగా జపాను ప్రజలు అంతగా పట్టించుకోరు'' ఇదీ వరస.

లంచం తీసుకోవడం తప్పుకాదు. ఆర్థిక అవినీతిని నిరాదరణ చేయలేరు జపాను ప్రజలు. పైగా అలాంటి చర్యలను ఉపేక్షిస్తారు వారు. ఒక వేళ వారికి తాత్కాలికంగా కోపం వచ్చినా, దానిని త్వరలో మరచి పోతారు. అహో! జపాను దేశమా! ఎలాంటి ప్రవర్తనా నియమావళిని ప్రపంచ ప్రజలకు అందజేస్తున్నావు!

# తెలుగులోకి అనువాదాలు

డా. ఎన్. ఇన్నయ్య

I have no money అంటే నేను లేనిడబ్బును కలిగి వున్నాను అని తెలిగించాడట ఒకాయన. ఇంగ్లీషులో ఉన్నది మక్కికి మక్కి తెలుగులోకి అనువదించాలి అనుకున్నపుడు వచ్చే చిక్కది. తెలుగులో అనుకొని ఆ భావాన్ని ఇంగ్లీషులోకి మార్చి చెప్పినప్పుడు కూడా ఇలాంటి చిక్కులే వస్తాయి. ''అడక్కడక్క అడిగితే సమాధానం చెప్పవా'' అనే మాటలను ఇంగ్లీషులో చెప్పాలనుకొని అనువదిస్తే ఒకతను ఇలా వ్రాశాడట: Asked not asked not I asked, you, replied not? ప్రతి భాష జీవ భాషే. భాషలో వున్న జీవాన్ని అర్థంచేసుకొని అనువదించాలే గాని మాటలకు అర్థం చెప్పటం ప్రధానం కాదు. ప్రాచీన కాలంలో మక్కికి మక్కి అనువదించినవి మూలాన్ని మించిపోయి మరోభాషలోకి తెచ్చినవీ వున్నాయి. వాల్మీకి రామాయణాన్ని ఎందరు అనువదించినా మూలాన్ని భేదించి చెప్పినవారే ఎక్కువ వున్నారు. తమ ఇష్టాఇష్టాలను చొప్పించకుండా మూలానికి న్యాయం చేకూర్చిన వ్యక్తిగా శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారిని పేర్కొంటారు. వ్యాసభారతాన్ని తెలిగించటంలో కవిత్రయం, ముఖ్యంగా తిక్కన చాలా చిలవలు, పలవలుగా మార్పులు చేసి రసవత్తరంగానూ, ఆకర్షణీయంగానూ తెలుగువారికి అందించారు. తెలుగులో మూలగ్రంథాలే తక్కువ. సంస్కృతం, ప్రాకృతం వంటి భాషలనుండి తెనిగించిన గ్రంథాలే మనకు పుష్కలంగా వున్నాయి. రానురాను సంస్కృతంలోని ఇతివృత్తాలు ఆధారంగా తెలుగులో సంస్కృత పదభూయిష్టమైన రచనలు సాగాయి.

పాశ్చాత్యులలో గ్రీకులు, రోమనులు చేసిన ఆలోచనలు, రాసిన రాతలను నాశనంగానివ్వకుండా అరబ్బులు అనువదించి యూరోప్ దేశస్థుల కందించారు. యూరోప్‌లో పునర్వికాసానికి ఇది ఎంతో దోహదం చేసింది. మన దేశంలో అలాంటి పునర్వికాసానికి దోహదచర్యలు జరగ లేదు. రామమోహన్‌రాయ్ వంటివారు సంస్కర్తలుగా మూలగ్రంథాలను మార్పు జేస్తూ తమ భావాలకనుకూలంగా వుండే వాటిని మనకందించారు. యూరప్‌లో చిరకాలం గ్రీక్, లాటిన్ ప్రభావం నుండి పూర్తిగా బయటపడలేని పరిస్థితే వున్నది. ఆధునిక విజ్ఞాన రంగంలో మన భాషలు అంతగా తోడ్పడలేని స్థితిలో వున్నాయి. ఇది భాషారీత్యా మన వెనుకబడినతనాన్ని సూచిస్తున్నది. అంటే విజ్ఞానం, సాంకేతికం వంటి అధునాతన విషయాలను భారతీయ భాషలలోకి పెట్టవలసి వచ్చినపుడు విపరీతమైన చిక్కులను ఎదుర్కొంటున్నాము. అనువాదాలు చేస్తే అర్థంగాకుండానూ, కృత్రిమంగానూ వుంటున్నాయి. భావాలు జటిలం కావటం ఒక కారణం కాగా, అందుకు తగిన పదజాలం మన భాషలలో లేకపోవటం మరో కారణం. ఇతర భాషలలోని సాంకేతిక పదజాలాన్ని యధేచ్ఛగా మన భాషలలోకి స్వీకరించే పట్టు, విడుపులుంటే ఫరవాలేదు. భాష భ్రష్టమౌతుందనీ, సంకరమౌతుందనీ, దుష్ప్రయోగమనీ మడిగట్టుకొని అంటరానితనాన్ని పాటిస్తే భాష పెరగదు. భావి విస్తృతి జరగదు. ఇలాంటి సంకుచిత మానసిక గూటిలో నివసిస్తున్న మనం ఇతర భాషల నుండి అత్యంత అధునాతన శాస్త్రీయ పరిశోధనలను

అరువు తెచ్చుకొనక తప్పని పరిస్థితి ఏర్ప డింది. అప్పుడే చిక్కులన్నీ ఎదురౌతు న్నాయి. ఈ విషయంలో మన అనువాద విధానాలు మారాలి. మన విద్యార్థులు పాశ్చాత్య దేశాలవారితో దీటుగా వుండా లంటే, మన సిలబస్, వారి స్థాయిలో రూపొందించుకోవాలంటే, మన అను వాద విధానం అధునాతనం కావాలి. విదే శాల్లో వున్న కవిత్వాలూ, నవలలూ, సృష్టికి సంబంధించిన కల్పనారచనలు మన భాషల్లోకి అనువదించకపోతే వచ్చే ఇబ్బంది లేదు. కాగా, ఆ ధోరణులు మనం తెలుసుకొని, మనకు అనుగుణంగా మలచుకోవచ్చు. సామాజిక, విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలలో పరిశోధన, పరిశీలన పాశ్చాత్య దేశాలలో విపరీతంగా సాగిపోతు న్నది. మన దగ్గర కూడా అలాంటి పరిశోధనే జరుగుతుంటే బహుశ అనువా దాల బాధ అంతగా వుండేది కాదు. మనది పరిశోధనాత్మక మనస్తత్వం కాదు. శబ్దప్ర మాణాలను అంగీకరించి, పెత్తనాన్ని స్వీక రించి, ఆకర్షణకు లొంగిపోయేచోట పరిశీ లన, పరిశోధన ప్రాధాన్యతలోకి రావు. మన వెనుకబడినతనం మానసిక రంగంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. కనుక ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా శాస్త్రీయ రంగాలలో పెంపొందాలంటే అక్కడి కృషిని అనువ దించుకోక తప్పదు. అకాడమీలు ఈ రంగంలో నిర్వహించవలసిన పాత్ర ఎంతో వున్నది. ఇందుకుగాను శాస్త్రీయమైన ఒక విధానాన్ని రూపొందించుకోవాలి.

ఇంగ్లీషులో వివిధ శాస్త్రీయ సాంకేతిక గ్రంథాలు, రచనలు పుష్కలంగా వుండ టమే కాక నిత్యనూతనంగా అధునాతనం చేస్తున్నాయి. ఇతర ప్రాంతాలలోని పరిశో ధన ఫలితాలను తక్షణమే స్వీకరించి ఇంగ్లీ షులో అందించగలుగుతున్నారు. సైన్సు భాష విశ్వజనీనం కావడానికి ఇవి ప్రధాన కారణాలు. అంటే జపాను, రష్యా వంటి చోట్ల శాస్త్రీయ పరిశోధన జరిగినప్పుడు ఆ భాషలోని సాంకేతిక పదజాలాన్ని అర మరికలు లేకుండా ఇంగ్లీషులోకి స్వీకరిస్తు న్నారు. దీనితో పోల్చిచూస్తే తెలుగులో మనం అనుసరించే పదజాలం అల్పం అనవచ్చు. ఇది మన వెనుకబడినతనానికి చిహ్నం. శాస్త్రీయ పరిశోధనలలో ఆధు నిక ప్రమాణాలు పత్రికల్లో వెలువడుతు న్నాయి. వాటి సారాంశాన్ని తెలుగులోకి స్వీకరించడం అవసరం. దీనివల్ల విద్యార్థు లకు, పరిశోధకులకు ప్రపంచంలో సమకా లీన విషయాలు ఎప్పటికప్పుడు తెలుస్తూ వుంటాయి. మన పత్రికల్లో (దినపత్రికలు కావు) చాలా అరుదుగా ఇట్లాంటి విష యాలు చూస్తాము. శాస్త్రీయ సాంకేతిక రంగాలలో అనువాదాల విషయమై మన కున్న అపోహలు, సందేహాలు, తడబాటు మానసికంగా మన వెనుకబడినతనాన్ని సూచిస్తుంది. చాలా సందర్భాలలో సరి యైన తెలుగు పదం లేదు అనే మాట వింటూ వుంటాం. భారతీయ భాషల న్నింటికి ఈ లోపం వున్నది. ఆధునిక శాస్త్రీయ పరిశోధనలు మనం అరువు తెచ్చు విషయం గనుక, వాటిని తెలుగు లోకి స్వీకరించటంలో వెనుకంజ వేయన క్కరలేదు. New Quantum Theory, Genetics, Vector Analysis, Particle Theorty, Gravity Waves Positron, Anti-matter, Black holes, Wavecles, Theromodynamics, Acquired Immune Deficiency Syndrom మొదలైన అంశాలెన్నో అత్యంత అధునాతన శాస్త్రీయ పరిధికి చెందినవి. తెలుగులో వాటికి సరియైన పదజాలం లభించటం దుర్లభం. ఈ పదా లకు దరిదాపులోని అర్థం వచ్చే పదాలు ప్రయోగిస్తే మూలంలోని అర్థం చెడిపో వచ్చు. కనుక వివరణ ఇస్తూ, వీలయితే

కృత్రిమ పదాలను సృష్టించడం లేక ఇతర భాషలలోని పదాలు యథాతథంగా స్వీకరించడం మంచిది.

సామాజిక శాస్త్రాలలో కూడా అధునాతన సిద్ధాంతాలు, పరిశోధనలు జరుగుతుండగా మనం ఇంకా వెనుకబడే వున్నాం. పాశ్చాత్య ప్రపంచంతోపాటు సామాజిక రంగంలో కూడా దీటుగా మనం వుండాలంటే అనువాదాలు చేసి ప్రయోజనం లేదు. మూలంలోని అంశాలు ఆధారంగా భావం చెడకుండా తెలుగులో ప్రమాణీకరణతో రాయడం అవసరం. అంటే మూలానికి యధేచ్ఛగా అనుసరణ చేయాలి. భావం మాత్రం సరిగ్గా వచ్చేటట్లు చూసుకోవాలి. మక్కీగా అనువాదం చేయడంవలన కృత్రిమంగా తయారు కావడమే కాక చదవడానికి ఇంపుగా లేకపోవడం, అర్థం కాకపోవడం, భాషపై జుగుప్స కలగడం కూడా గమనించవచ్చు. ఈ విషయంలో మన కున్న ఛాందస ధోరణిని మార్చుకోవాలి.

ఉదాహరణకు, రాజకీయ తత్వశాస్త్రాన్ని తీసుకుందాము. ఈ రంగంలో జరిగిన పరిణామాన్ని గ్రీకు - రోమనుల కాలం నుండి నేటి వరకు తెలుసుకున్న తరువాత ప్రస్తుతం చర్చలో వున్న విషయానికి రావాలి అనుకుంటే - మంచిదే కావచ్చు కాని, ఇదంతా పూర్తి కావడానికి చాలాకాలం పడుతుంది. ఈలోగా ఇతరులు మనకంటే చాలా ముందుకు పోతారు. కుందేలు, తాబేలు పందెంవలె మనం ఎప్పుడూ వెనుకబడే వుంటాం. రాజకీయశాస్త్ర పరిణామాలు కుదించి తెలుగులోకి తెచ్చి, అది ఒక చారిత్రకాధారంగా చూపి ఇప్పటి ధోరణులు పాశ్చాత్యులతో సమానంగా బోధించగలిగితే సమవుజ్జీలుగా పయనించగలుగుతాం. ఇదే ఉదాహరణను ఇంచుమించు అన్ని శాస్త్రాలకూ అన్వయించవచ్చు. అంటే మన అనువాద విధానమే మారాలన్నమాట. తెలుగులో సారాంశాలను చెప్పటం ప్రధానంగా స్వీకరించటం అనేది విధానంగా పెట్టుకోవాలి. విదేశాలకు సంబంధించిన గ్రంథాలు, పరిశోధన పత్రికలు ఆధారంగా ఈ కృషి జరగాలి. విద్యారంగంలో మన సిలబస్ వెనుకబడి వుండటానికి, పాశ్చాత్య దేశాలలో వెంటనే గుర్తింపు పొందకపోవటానికి వారితో సమానంగా పాఠ్యప్రణాళికలు రూపొందించుకోలేకపోవటమే కారణాలు. సాంకేతిక, శాస్త్రీయ, వైద్య, వ్యవసాయ రంగాల్లో ఈ విషయ, స్పష్టంగా కనిపిస్తుంది. అనువాదాలు చేసుకుంటూ పోతుంటే మనం పాశ్చాత్యులతో ఎన్నటికీ సమానం కాలేము.

విషయాన్ని అందించటం ఎంత ముఖ్యమో, ఆహ్లాదకరంగా చదివించేటట్లు చేయడం కూడా అంత ప్రధాన విషయం. ముఖ్యంగా, మన పాఠ్యగ్రంథాలు ఈ విషయంలో తీవ్రలోపాలను సూచిస్తున్నాయి. మన చరిత్రలు రాజుల, రాణుల పుట్టుక, చావుల తేదీలతో, యుద్ధాల వివరాలతో బోరుకొడుతున్నట్లు విద్యార్థులు భావిస్తున్నారు. ఆర్థికపరమైన విషయాలు అసలు ఇంపుగా రాయలేక పోతున్నట్లు ఫిర్యాదులు వున్నాయి. సైన్సు విషయం ఇక చెప్పనక్కరలేదు. సొంతంగా వ్రాసేవాటి సంగతే ఇలా వుంటే అనువాదాల విషయం పట్టించుకునేవారే లేరు. Boyd వ్రాసిన ఫిజియాలజీ, విద్యార్థులు ఆసక్తిగా చదవటమే కాక అనేక వాక్యాలు కంఠత పట్టడం గమనించవచ్చు. నిర్జీవమైన విషయాన్ని ఆసక్తికరంగా చెప్పడం ఒక ఆర్ట్. అనువాదాల విషయంలో ఈ జాగ్రత్త మరీ ఎక్కువగా తీసుకోవాలి. ఉదాహరణలు, పోలికలు, సామెతలు చెప్పి చదివించేటట్లు చేయడం అవసరం. అనువాదకుడి ప్రతిభ అందుకు చాలకపోతే భాషాశాస్త్రజ్ఞులు,

అనువాదకులు సహకరించి, ఈ పని చేయ వలసి వుంటుంది.

''టైమ్స్'' వారపత్రిక ప్రతివారం ఇంచుమించు రెండువేల పేజీల విషయాన్ని మర్దించి, కుదించి, వస్త్రకాయం పట్టి చివరికి యాభై పేజీలలో సరిపెడుతుంది. ఈ కృషి వెనుక ఎందరి శ్రమ వుంటుంది అనేది ఊహించాల్సిన విషయం. చేర్పులు చేసుకుంటూ పోవాలి. అనువాదాల్లో ఈ వైఖరి చాలా అవసరం. ఉదాహరణకు సామాజిక శాస్త్రాన్ని తీసుకుందాం. బి.ఏ., ఎం.ఏ. స్థాయిలో ఎ.ఆర్. దేశాయ్ పుస్తకం ''ది రూరల్ సోషియాలజి ఇన్ ఇండియా'' బోధనగ్రంథంగా స్వీకరించారు. 1969లో ఈ గ్రంథాన్ని శ్రీ దేశాయ్ కొంతవరకు అధునాతనం చేశారు. 1990లో తెలుగులో ఆ గ్రంథాన్ని వెలువరిస్తున్నారు. అంటే తెలుగు మీడియం విద్యార్థులు ఇంచుమించు 20 ఏళ్లు వెనుకబడి వుంటారన్నమాట. దీనికి బదులు ప్రస్తుతం రూరల్ సోషియాలజీలోని పుస్తకాలు, పత్రికలు ఆధారంగా గ్రంథాన్ని రాయిస్తే విద్యార్థులకు ఆధునిక స్థాయిని చేకూర్చిన వారు అవుతారు. సామాజిక శాస్త్రంలోనే పరిస్థితి ఇలా వుంటే సైన్సు, టెక్నాలజీలలో ఎలా వెనుకబడి వుంటామనేది ఊహించవచ్చు. ముఖ్యంగా విదేశీ గ్రంథాలు, పత్రికలు తెలుగులోకి తీసుకొని రావాలి. అన్నప్పుడు అనుమతి పొందడం, అనువాదం చేయడం, అచ్చువేయడం, కాలయాపనతో కూడిన పని. ఇవి జరిగేటపుడు ఆయా రంగాల్లో అనేక కొత్త విషయాలు వస్తూనే వుంటాయి. కనుక విదేశాలకు సంబంధించినంత వరకు సాంప్రదాయ అనువాద పద్ధతిని మానివేసి అనుసరణ పాటిస్తే మనం కూడ పాశ్చాత్యుల స్థాయిలో వుండగలుగుతాము. కనుక ఈ విషయంలో అట్టే ఇబ్బంది వుండదు.

మనకు దేశీయ భాషలలో పాఠ్యగ్రంథాలు సర్వసాధారణంగా ఒకటే వుండటం విచారకరం. రిఫరెన్సులు ఇంగ్లీషులో చాలా వున్నప్పటికీ తెలుగులో ఇవి అల్పం అనవచ్చు. ఈ విషయంలో కూడా మన వెనుకబడిన తనాన్ని పోగొట్టుకోవడానికి అనువాదాలు బదులు అనుసరణ పద్ధతి ఆచరిస్తే మంచిది.

# వరివస్య

## శ్రీ స.చ. రామానుజాచార్యులు

ఆంధ్రా యూనివర్సిటీ రిజిష్టారు ఆఫీసులో తాత్కాలికంగా పనిచేస్తున్నప్పుడు, 1957 వేసవిలో, నేను పనిచేస్తున్న సెక్షనుకి వచ్చి డా. కొత్తపల్లి వీరభద్రరావుగారి థీసిస్ కాపీ లైబ్రరికి పంపించమని ఆ సెక్షను సూపరిండెంటుని అడిగా రొకాయన. ఆయన్నీ చూడగానే, ఆయన యెవరో ప్రముఖులని తోచి, ఆయన యెవరో తెలుసుకోవాలనిపించింది నాకు. పక్కనున్నాయన్ని అడిగాను. ఆయన యెవరని. 'మీకుతెలీదా. అబ్బూరి రామకృష్ణారావు గారంటే ఆయనే. యూనివర్సిటీ లైబ్రరేరియన్' అని చెప్పాడాయన. అదే నేను మొట్టమొదటిసారి శ్రీ రామకృష్ణారావుగార్ని చూడటం. 'వైతాళికులు' సంకలనంలో ప్రచురించిన పద్యాలు తప్ప వారి యితర రచనలతో నాకు పరిచయం లేదు. వారి పేరు మాత్రం విన్నాను.

ఆ తరువాత నేను యూనివర్సిటీ ఉద్యోగం మానేసి, వేరే ఫ్యాక్టరీలో పని చెయ్యటానికి చేరడంతో, వాల్తేరు మిట్టకి రావటం తగ్గిపోయింది. నా సహోద్యోగుల పరిచయంతో నేను విశాఖ రచయితల సంఘంలో చేరటం, మరొక నాటక సంఘంతో కాలకేపం చేస్తూండటం జరిగింది. రామకృష్ణారావుగారు విశాఖ రచయితల సంఘం సమావేశాలకి తరచుగా వచ్చేవారు. అల్లాగే నాటకాలు వేసే వాళ్ళని కూడా కలుసుకుంటూ వుండేవారు. ఆ రెండు చోట్లా నన్ను రామకృష్ణారావు గారికి పరిచయం చేశారు. నమస్కారాలతో సరిపోయింది. అంతకన్నా ఆయనతో నాకుగాని నాతో ఆయనకు గాని పనియేమి లేక పోయింది.

ఆ రోజుల్లో శ్రీమాన్ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులుగారు తెలుగు భాషా సమితిలో పని చేయ్యటానికి మద్రాసు నించి వాల్తేరు వచ్చారు. వారితో నాకు పరిచయం కలిగింది. వారింటికి వెళ్ళి అప్పుడప్పుడు కాలకేపం చేసేవాణ్ణి. నాకు తెలుగు పద్యాల పుస్తకాలతో పరిచయం వుందని శ్రీనివాసాచార్యులు గారికి తెలుసు. మా కబుర్లలలో శ్రీనివాసాచార్యులుగారు చెప్పేవారు ''తెలుగులో కవిత్వం చెప్పగలిగిన బహుకొద్ది మందిలో రామకృష్ణారావుగారొకరు'' అని. 1958 చివర్లోనో, 1959 మొదట్లోనో ఒక సాయంకాలం శ్రీనివాసాచార్యులుగారు రీడింగు రూము ప్రాంతంలో యెదురు పడ్డారు. (ఆ రోజుల్లో విశాఖపట్టణంలో వున్నది ఒకే రోడ్డు. అవూళ్ళో వున్న వాళ్ళు ఆ రోడ్డు మీద యెదురుపడి తీరవల్సిందే.) రామకృష్ణారావుగారు 'నన్నయ పద ప్రయోగసూచి' పని చెయ్యటానికి నన్ను వారి దగ్గరికి తీసుకు రమ్మన్నారని చెప్పారు. నన్ను రామకృష్ణారావు గారెందుకు పిలుస్తున్నారన్నాను. ఆయనకి మిమ్మల్ని తెలియక పోవటం యేమిటి అన్నారాయన. 'నన్ను గురించి వారికెల్లా తెలుస్తుంది? మీరేమైనా చెప్పారేమి' అన్నాను. 'సరే ఎప్పుడొస్తారు రామకృష్ణారావు గారింటికి' అని అడిగారు శ్రీనివాసాచార్యులుగారు. 'నేను రాను' అని సమాధానం చెప్పాను. 'అదేమిటి?' అన్నారాయన నవ్వుతో ''రామకృష్ణారావుగారు రోడ్డు మీద యెదురుపడితే 'విష్' చేస్తే బదులు చెప్పలేదు రెండు మూడు

సార్లు. పెద్దవారితో పరిచయాలంటే నాకు సరదా లేదు' అని చెప్పాను. శ్రీనివాసాచార్యులుగారు వదల్లేదు. 'మీరు రాకపోతే రామకృష్ణారావుగార్ని మీ రూముకి తీసుకు వస్తాను' అన్నారు. దానితో నేను దిగివచ్చి 'రామకృష్ణారావుగార్ని నా రూముకి తీసుకు రావద్దు, నేనే వస్తాను' అని చెప్పి, ఆ వారం చివర శ్రీనివాసాచార్యులుగారితో రామకృష్ణారావుగారి దగ్గరికెళ్ళినా, నన్నయ భారతంలోంచి 16 పేజీల ఫారం ఒకటి తీసుకొని, వారు యేర్పరుచుకున్న సూత్రాల ప్రకారం అ 16 పేజీలలో మాటలూ కార్డుల మీద రాసి, వారం రోజుల్లో తిరిగి యిచ్చేశాను. నన్నయ పద ప్రయోగసూచికలో నావంతు పని అయిపోయిందనుకున్నాను.

అప్పట్లో భారత ప్రభుత్వం దేశం అంతటా ''విజ్ఞాన మందిరాలు'' నెలకొల్పాలని సంకల్పించి, అందుకు విజ్ఞాన మందిరాఫీసర్లూ, అసిస్టెంటు విజ్ఞాన మందిరాఫీసర్లూ కావాలని పత్రికలలో ప్రకటన ఇచ్చింది. ఆ వుద్యోగాలకి దరఖాస్తు పెట్టాలని నేనూ, మా నాటక మిత్రులూ అనుకున్నాం. నాకు నాటకాలతో, సాహిత్యంతో పరిచయం వున్నట్టు యేమీ సాక్ష్యాధారాలు లేవు. అందుకని రామకృష్ణారావుగారి దగ్గర ఒక సర్టిఫికెట్టు తీసుకొని, దానినకలు నా దరఖాస్తుతో జతపరిచి పంపాను. 1959 ఏప్రిల్ 28వ తేదీన యిచ్చిన సర్టిఫికెట్ యింకా భద్రంగా వుంది. దాంట్లో ''He has been recently assisting me in the compilation of a Concordance of the famous Telugu Poet Nannaya of the 11th Century'' అని రాసి యిచ్చారు. రామకృష్ణారావుగారు. 16 పేజీల నుంచి ఆరోపాలు (entries), ప్రయోగాలూ, పర్యవశ్వాసపద్య సంఖ్యాలూ రాసి పెట్టిన మాత్రానికి యింతటి సర్టిఫికెట్ యిచ్చినందుకు నాకు యెంతో కృతజ్ఞత కలిగింది. అంత కుమునుపు నేను మద్రాసు రాష్ట్ర సర్వీసు కమీషను పరీక్షకి దరఖాస్తు పెట్టాలనుకున్నప్పుడు, నాకు తెలుగొచ్చునని సర్టిఫికెట్ తెచ్చుకోమని సర్వీసు కమీషను వారు నన్నాదేశించారు.

తరవాత యేదో సమావేశం తటస్థపడ్డప్పుడు, శని, ఆదివారాల్లో పదప్రయోగ సూచి పనిచెయ్యటానికి వారింటికి వస్తూండమని పిల్చారు. రామకృష్ణారావు గారు. అప్పటినుంచీ నన్నయ పదప్రయోగసూచి వ్రాతప్రతి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికి అచ్చుకి అప్పజెప్పే వరకూ ప్రతి శని, ఆదివారాలూ వారింటికి వెళ్ళి, ఆ పని చేస్తూవుండే వాణ్ణి, పని తొందరగా ముగించవలసి వచ్చినప్పుడు 45 సెలవులూ పెట్టి పని చేశాను. వారితో మొదటే చెప్పాను ''నేను తెలుగు వ్యాకరణం, భాషాశాస్త్రాలు చదువుకోలే''దని. ''అదేమీ అక్కర్లేదు. తెలుగుమాట యేదో దానికి అర్థం యేమిటో తెలిస్తే చాలు. అర్థం తెలియకపోయినా మాట గుర్తుపట్ట గలిగితే, అర్థం యేమిటో తరవాత చూడొచ్చును'' అని నన్ను ప్రోత్సహించి నాచేత పనిచేయించారు. ''పదప్రయోగ సూచి'' పనికి తమకి వీలైనప్పుడు డా. భద్రిరాజు కృష్ణమూర్తిగారు, శ్రీ తూమాటి దొణప్పగారు, శ్రీ బూదరాజు రాధాకృష్ణగారు, శ్రీ మెట్టా వెంకటేశ్వరరావుగారు, శ్రీనివాసాచార్యులుగారు వస్తూ వుండేవారు. కొన్ని వారాలు గడిచిన తరవాత క్రమక్రమంగా అందరూ రావటం తగ్గించారు. చివరకి నేనొక్కణ్ణే మిగిలాను పనిచెయ్యటానికి. ఎవరి పనులు వారికున్నాయి. అందువల్ల ''నాపని'' అంటూ యేమీ లేనివాణ్ణి నే నొక్కణ్ణే మిగిలాను. ఆ పనిచేసే రోజుల్లో రామకృష్ణారావుగారికి

నేను సన్నిహితుణ్ణయ్యాను. నాకు వారి మీద గౌరవం (గురుభావం) పెంపొందింది.

ఒకనాడు రామకృష్ణారావుగారితో యెవరో, యెక్కడో జరిగిన ''భువన విజయం'' కార్యక్రమాన్ని గురించి చెబుతున్నారు. ఇటువంటి కార్యక్రమాలు జరుగుతయ్యనేది నేను కొత్తగా వింటున్నానిప్పుడు. వారు అక్కడున్న వారిలో చనువు తక్కువే అయినా చటుక్కున ''ఈ Tomfoolery యెప్పుడు మొదలైంది మేష్టారు'' అన్నాను. తొందరపడ్డానేమో అని జంకాను. రామకృష్ణారావుగారు నవ్వి, ''నటులు కాని వాళ్ళు, పద్యాలు బాగా చదవటం రానివాళ్ళు, విచిత్ర వేషాలు వేసుకొని స్టేజిమీద అస్తవ్యస్తంగా వ్యవహరిస్తూ వుంటే, అది యేమి వినోదమో జనానికి!'' అన్నారు. ముప్పైయేళ్ళపైనే గడిచిపోయినా ఆ వెర్రి యింకా వెర్రి తలలు వేస్తూనేవుంది.

''పదప్రయోగ సూచి''ని గురించి చాలా సంగతులు నాతో మాట్లాడుతూ వుండేవారు. డా. కట్టమంచి రామలింగారెడ్డిగారూ, రామకృష్ణారావుగారూ, మరి కొందరూ, 1935లో ఇంగ్లీషులో వున్న Concordance ల వంటివి తెలుగులో చేయించాలనీ, ముందుగా మొదటి తెలుగు గ్రంథానికి (భారతం రెండున్నర పర్వాలకీ) తయారు చేయించాలనీ అనుకున్నారట. పాతికేళ్ళ వారి సంకల్పం నెరవేరుతున్నందుకు యెంతగానో సంతోషపడేవారు. విశాఖ రచయితల సంఘంలో మొదలు పెట్టిన పదప్రయోగ సూచి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ యేర్పాటైన తరువాత, అకాడమీ తరపున ఈ పని చేయించటానికి ఒప్పించటానికి శ్రమ పడవలసి వచ్చిందని చెప్పేవారు. ఆనాటి అకాడమీ సభ్యులలో శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు తప్ప తక్కిన వారెవరూ తమకి మద్ధతు యివ్వలేదనే వారు. ఎలాగో తమ పలుకుబడివల్ల రూ. 3000/-లు మాత్రం మంజూరు చేయించుకోగలిగారు. యూనివర్సిటీ లైబ్రరీకి పుస్తకాల పార్సిళ్ళతో వచ్చిన అట్టలూ రేపర్లూ కత్తిరింపించి, ఆరోపాలు (entries) రాయటానికి కార్డులుగా వాడుకున్నారు. కార్డులమీద రాసిన ఆరోపాలన్నీ సరిగా వున్నదీ లేనిదీ చూసి, లేని ఆరోపాలు రాసేపని అంతా నేనే చేశాను. తెలుగు సాహిత్యంతో పరిచయం వున్న నా సోదరుడు శ్రీనివాసాచార్యుల్ని విశాఖపట్నం పిలిపించి, కార్డులన్నీ కొంతకొంతగా నా రూముకి తీసుకువెళ్ళి అన్నీ చదివి దిద్దుబాట్లు చేశాను. సుమారు 70 వేల కార్డులు అకారాది అనుక్రమణికలోకి తీసుకరావలసినప్పుడు, లైబ్రరీలో పని చేస్తున్నవారు పది, పన్నెండుమంది వచ్చి సాయం చేశారు. వారిలో శ్రీ వాసుదేవరావుగారూ, శ్రీ ప్రకాశరావుగారూ. శ్రీ జోగారావుగారూ నాకు జ్ఞాపకం వున్నారు. వాళ్ళు మొదటి రెండక్షరాల వరకూ విడదీసి యిచ్చారు. తక్కిన క్రమం అంతా చాలావరకూ నేనూ, మేష్టారూ (నేను రామకృష్ణారావుగార్ని అల్లాగే పిలిచేవాణ్ణి) కూర్చాము ప్రాత ప్రతిలో సుమారు 3,300 పేజీలు వారూ నేనూ కలిసి తయారుచేశాం. అందులో సుమారు 2,500 పేజీలు నేను తయారుచేశాను. రాయటానికి నా మిత్రులు ఒకరిద్దరు తోడ్పడ్డా, వారు రాసినది నేను మళ్ళీ చదివి తప్పులు దిద్దే బాధ్యత నామీద పెట్టుకొని, వారిచేత రాయించాను. మిగిలిన రెండు వందల పేజీలు రాయవలసిన అకాడమీ వారికి హైదరాబాదులో అప్పజెప్పి రామకృష్ణారావుగారు ఢిల్లీ వెళ్ళారు.

సుమారు రెండున్నర సంవత్సరాల కాలం విశాఖపట్నంలో వారితో తరచుగా

కలుసుకొనే రోజుల్లో యెన్నో సంగతులు దొర్లినయి. అవి యెక్కడా గుర్తురాసి పెట్టుకోలేదు. ఒకనాడు మేష్టారితో తెలుగు లెక్చరరు యెవరో ఒకరు, మరొక తెలుగు లెక్చరరు ఊళ్ళో లేరనీ Extension Lectures యివ్వటానికి వెళ్ళి వున్నారనీ చెప్పారు. అది వినగానే నేను Extension Lecture ని ''అధిక ప్రసంగం'' అని తెలుగు చేశాను. అందరూ నవ్వారు. మేష్టారు మెచ్చుకొని, దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు యిల్లాం టివి చెప్పేవారంటూ Muncipality ని ''పానాపాన పరిపాలన'' అనే వారని ఉదహరించారు.

ఏటవాలుగా వున్న కొండమీదికి వెళితే, యెంత యెత్తుకు వెళ్ళామో తెలియనట్టే, మేష్టారితో క్రమంగా యేర్పడ్డ సాన్నిహిత్యంవల్ల వారి ఔన్నత్యం వారితో వున్న వాళ్ళకి స్పృహలో వుండదు. ఎంతు యెత్తున వున్నా కళ్ళు తిరగవు. పక్కన వున్న కొండల్ని చూస్తే, తామువున్న కొండ యెంత యెత్తుగావుందో తెలుస్తుంది. దుగ్గిరాల గోపాలకృష్ణయ్యతోనూ, డా. కట్టమంచి రామలింగారెడ్డితోనూ, యం.యన్. రాయ్‌తోనూ, మరెందరో జగత్ప్రసిద్ధులైన పండితులతో, కవులతో, నటులతో, గాయకులతో, రాజకీయ నాయకులతో, వ్యాపారస్థులతో, వారికున్న ప్రగాఢ పరిచయాన్ని చూస్తే, మేష్టారి ఔన్నత్యం గుర్తుకు వస్తుంది.

భారత స్వర్గారోహణ పర్వం చివరి పద్యం

''పరమపదాప్తి హేతువగు భారతసంహిత
శౌసకాది భూ
సురవరు లింపునం గరగు చొప్పున
జెప్పిన వారు మోదస
భరితత బొంది యక్కథకు బ్రాతిగ నర్చి
తుజేసి రర్మిలిన్''

అని భారతకథ చెప్పటం అయిపోయిందని చెప్పి, విన్నవాళ్ళు మెచ్చుకున్నారన్న తరవాత,

''హరిహరనాథ సర్వభువనార్చితనన్
గృపజూడు మెప్పుడున్'' అని తిక్కన సోమయాజి పెద్ద నిట్టూర్పు విడిచిపెట్టి, సంవత్సరాల తరబడి విడవకుండా చేసిన పని ముగిసినందుకు యెంత విశ్రాంతి ననుభవించాడో అని శ్రీ రామలింగారెడ్డి అంటూండేవారు అనే వారు మేష్టారు. నన్నయ పద ప్రయోగసూచికని ముగించే టప్పుడు పదేపదే యిదే అనేవారు.

ఎం.ఎన్. రాయ్ విశాఖపట్టణంలో వున్న రోజుల్లో, ఆయనతో మేష్టారికి సన్నిహిత సంబంధం యేర్పడ్డది. రాయ్‌తో సంభాషణల్లో యెప్పుడో హరింద్రనాథ చట్టోపాధ్యాయ ప్రస్తావనవస్తే, మేష్టారు హరీన్ చటర్జీని గురించి 'he made a mess of his life' అని వ్యాఖ్యానించారట. వెంటనే రాయ్ ప్రశ్నించాడట: 'What wefse do you want him to make his life'. అని ప్రశ్నించి, నువ్వింత వివేచనతో, శ్రద్ధతో, జాగ్రత్తగా జీవితం నిర్వహించి యేమి సాధించావు. నేనేమి సాధించాను. మానవ జీవితాన్ని మన యిష్టం వచ్చినట్టు నడపటానికి వీలుపడదు. అది అంతే'' అన్నాడని చెప్పేవారు.

'నన్నయ పదప్రయోగసూచి' పనిచేసే రోజుల్లోనే ఒకరోజు మేష్టారు వివిధ భాషల రచయితల్ని గురించి మాట్లాడుతోంటే, నేను ''మేష్టారూ! మీరు యూనివర్సిటీ లైబ్రేరియన్ అయిన తరువాత చాలా పుస్తకాలు చదివారనుకుంటాను'' అన్నాను. వెంటనే ఆయన నవ్వి ''మిఠాయి కొట్టువాడు కారాకిళ్ళీలేసుకు కూచుంటాడు. లైబ్రరీకి రాకముందే చది

మీని ఆశ్రయించుకున్న మూఢులెవరో అటువంటి పేరుపెట్టి అచ్చువేయించారు. ఆ పుస్తకం వెలువడి ఇరవయ్యేదు సంవత్సరాలపైనే అయినా, నన్నయ భాష మీద కూలంకషమైన పరిశోధన యేమీ జరిగినట్టు లేదు, ఉత్తసాల్లు వ్యాసాలు రాయటం తప్ప, ఆంధ్రదేశంలో నన్నయ భారతభాగం ప్రతిమాట పట్టి పట్టి చూసి నవాళ్ళం, మేష్టారూ, నేనూ ఇప్పుడు మేష్టారు లేరు. ఈనాడు ఆంధ్రదేశంలో నన్నయని గురించి చెప్పటానికి యెక్కువ అధికారం వున్నవాణ్ణి నేనే.

నన్నయ పదప్రయోగకోశం తయారు చేసే రోజుల్లోనే, దాని తరువాత తిక్కన పదప్రయోగకోశం, ఎర్రన పదప్రయోగ కోశం చేయించాలనీ, అన్నమాచార్య పద ప్రయోగకోశం తయారయితే పద్యకావ్యా లలో దొరకని యెన్నో మాటలకి అర్థం నిర్ణయం చెయ్యటానికి వీలుపడుతుందనీ అనేవారు. నన్నెచోడ పద ప్రయోగకోశం తయారు చెయ్యాలనే సంకల్పం మేష్టారికి యెప్పుడూ లేదు. దానిమీద వారి పేరు వున్నందుకు చింతించేవారు. కుమారసం భవ కర్తృత్వాన్ని గురించి వారికి యెప్పుడూ సందేహం వుండేది. ఇటీవల నన్నెచోడుడు— కుమార సంభవం అంతా కూటసృష్టి అని ప్రా. కొర్లపాటి శ్రీ రామమూర్తిగారు నిర్ధారణ చేశారు.

అల్లాగే, ఆ రోజుల్లో నా పెళ్ళిని గురించి, వారితో నేను చెప్పేవాణ్ణి. నా పెళ్ళిని గురించి యితరులు వారితో చెప్పి నని నాకు చెప్పేవారు. అప్పుడే, నేను వారి దగ్గరకి రాను అన్న మాట శ్రీనివా సాచార్యులుగారు చెప్పారని చెబుతూ ''నువ్వు రోడ్డుమీద యెదురుపడి నమ స్కారం అంటే నేను బదులు చెప్పలే దనుకున్నావట. సాయంకాలం పూట చూపు ఆనక, బదులు చెప్పలేదు గాని, వాను, నేను చదవిన దంతా'' అన్నారు.

''నన్నయ పదప్రయోగ సూచి'' వ్రాతప్రతి తయారు చెయ్యటానికి అకా డమీ డబ్బు మంజూరు చేసింది కాని, అచ్చువెయ్యటానికి మొదట్లో మంజూరు చెయ్యలేదు. వ్రాతప్రతి తయారు అవు తూంవుండగా, ఒకసారి అకాడమీ మీటిం గుకి హైదరాబాదు వెళ్ళివచ్చి, అకాడమీ వారు అచ్చువేయించటానికి కూడా నిర్ణ యించారని చెప్పారు. ఆ మాట చెబుతూ ''రామాంచార్లూ,'' మొన్న మీటింగు అయిన తరువాత గోపాలరెడ్డిగారు, ''నన్నయ పద ప్రయోగసూచి'' పుస్తకం మీద మీ పేరుతోబాటు దివాకర్ల వేంకటా వధానిగారి పేరు కూడా వేయిద్దాం. అవ ధానిగారు తయారు చేయిస్తున్న నన్నె చోడ పదప్రయోగకోశం మీద మీ పేరు కూడా వుంటుంది, ఏమంటారు? అని అడిగారు. 'సరే, పెద్దవాడు గోపాలరెడ్డి గారు చెబుతున్నారు కదా అని, వారి మాట తీసెయ్యలేక, నేను ఒప్పుకు న్నాను' అని చెప్పారు. నాకు గతుక్కుమ న్నది. 'మేష్టారూ, మీ పేరుతోబాటు నా పేరు పుస్తకం మీద వేయించమని నేను అడగటం లేదు. కాని, యింతపని నేను చేసిం తరువాత, యేమీ చెయ్యని దివాకర్ల వేంకటావధానిగారి పేరు నన్నయ పద ప్రయోగ చూచి మీద వెయ్యటం నాకు అంగీకారం కాదు' అని చెప్పాను. నేను యెంతనొచ్చుకున్నానో, నొచ్చుకోటా నికి నాకు యెంత హక్కువుందో తెలిసిన మేష్టారు ఆరోజు నన్ను చాలసేపు ఊర డించారు. ఇంత ఆయిన తరవాత కూడా నేను పని మానెయ్యలేదు. శ్రద్ధ సడలించ లేదు.

'నన్నయ పదప్రయోగకోశం' అనే పేరు మేష్టారికి సమ్మతంకాదు. అచ్చు పనివారు పర్యవేక్షించలేదు గనుక, అకాడ

తనకు అతిశయమూ లేదు. యెవరి మీదా తిరస్కారం అంతకన్నా లేదు' అన్నారు.

నాకు చిన్నతనం నించీ శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి శాలివాహన గాథా సప్తశతీసారం అంటే చాలా మక్కువ. మేష్టారికి శర్మగారితో మైసూరులో చదువుకొనే రోజుల్లో స్నేహం అని తెలిసిన తరువాత, శర్మగారిని గురించి నాకున్న గౌరవం వెలిబుచ్చాను. మైసూరులో శర్మగారు వుండగా, రామలింగారెడ్డిగారు తాము రాసిన వ్యాసాలు శర్మగారికి యిచ్చి, అరసున్నాలూ, పరుషసరళాలూ దిద్దిపెట్టమనే వారు. అలాగ రెడ్డిగారి వ్యాసాలు సవరిస్తూ శర్మగారు రెడ్డిగారి చమత్కృతిని, శైలినీ అలవరుచుకున్నారనీ చెప్పారు. శర్మగారికన్నా కూడా, వారి అన్నగారు శ్రీమాన్ రాళ్ళపల్లి గోపాలకృష్ణమాచార్యులుగారు, సరస సంభాషణాచతురలనీ, వారితో యెంత సేపు ముచ్చట్లు చెప్పుకుంటూ కూచున్నా, యిట్టే పొద్దు పోతుందనీ చెప్పేవారు.

• పదప్రయోగ సూచికల పనికి డబ్బు యివ్వటం లేదు. గనుక యెవ్వరూ రారనీ, జీతాలు యేర్పాటుచేసి పనికి పిలిస్తే, యింతమంది వస్తారని, వారి బట్టతల మీద చెయ్యిపెట్టి చూపుతూ అన్నారు మేష్టారు. నేను నవ్వు ఆపుకోలేక పోయాను. 'చాలామంది' అని చెప్పటానికి, నెత్తిమీద జుట్టువున్న రోజుల్లో చేసే అభినయం, బట్టతల అయిన తరవాత కూడా చేశారని నవ్వాను నేను. వెంటనే మేష్టారూ నవ్వి' ''నవ్వకు, 'ఇంతమంది' అంటే, నెత్తిమీద జుట్టువుంటే యెన్ని వెంట్రుకలుంటయ్యో, అంతమంది అని అర్థం'' అన్నారు.

'ముందు — వెనుక' అనే మాటల్ని గురించి మేష్టారికీ నాకు అభిప్రాయభేదం వస్తూ వుండేది. నన్నయ భారతంలో ప్రయోగం వెదుకుతూవుంటే, ముందు వుంటుంది చూడమనేవారు. అంటే నేను వెదుకుతున్న భాగానికి తరవాత భాగం చూడటం మొదలు పెట్టేవాణ్ణి. ఆయన వుద్దేశం నేను చూస్తున్న భాగానికి పూర్వమే అని చెప్పేవారు. అల్లాగే 'వెనక' అన్నాకూడా. ఇంకా వెనక చూడు అన్నా కూడా నేను తరవాత భాగం వెదుకుతుంటే, మళ్ళీ వేరే మాటల్లో వారు యెక్కడ వెదకమనేదీ చెప్పేవారు. ఈ చిన్నమాటల్లో వారొకటి చెబితే, నాకు యింకొకటి అర్థం అవటం గమనించి నవ్వుకుంటూ వుండేవాళ్ళం. శబ్దానికీ అర్థానికీ మధ్యవున్న సంబంధాన్ని గురించి నాకున్న శంకలు, నిశ్శంకగా వారితో చెప్పేవాణ్ణి.

తెలుగు నాటకాన్ని గురించి మేష్టారితో ప్రస్తావిస్తే, తెలుగువాళ్ళకి నాటకం అంటే యేమిటో తెలియదని నిర్ద్వంధంగా చెప్పేవారు. తెలుగు వాళ్ళకి నాటకం అంటే తెలీదు గాబట్టే, కాళిదాసు అభిజ్ఞాన శాకుంతల లాంటి ఉత్తమ నాటకాన్ని, పిల్లలమర్రి పినవీరభద్రుడు ప్రబంధంగా తెలుగు చేశాడు అని చెప్పేవారు. ఈమాట చెబితే తెలుగువాళ్ళంతా మండి పడతారు అని కూడా అనేవారు. అల్లాగే నన్నయ రచన అంత ఉత్కృష్టమైనది కాదు. మన కర్మకాలి నన్నయ తెలుగులో మొదటి కావ్యం రాశాడు గనక, ఈ పదప్రయోగసూచి మనం చెయ్యాల్సి వచ్చింది. ఆ మాట మనం అంటే మన మీద విరుచుకుపడతారు అనేవారు. మంచి తెలుగు నాటకం రాయటానికి పెద్దమొత్తం బహుమతి ప్రకటిస్తే, యెవరైనా రాస్తారని శ్రీ కూర్మా వేణుగోపాల స్వామిగారు అనేవారట. లక్షరూపాయల బహుమానం ప్రకటించినా, యెవడూ రాయలేడన్నది ఆయనకి అర్థం అయ్యేట్టు

చెప్పలేక పోయాను అనే వారు మేష్టారు. తెలుగులో నాటకం రాయాలంటే, నాటక ప్రదర్శన అంటే యేమిటో తెలియని వాళ్ళకి యేం చూపించినా, చూసేసి వెళతారు. పద్యాలో, పాటలో పాడితే విని సంతోషించి వెళ్ళి పోతారు. మన దేశంలో ఒకనాడు సలక్షణమైన సంస్కృత నాటకాలు ప్రదర్శిస్తే చూసి ఆనందించే వారు. దేశ భాషల్లోకి అనాటక కళరాలేదు. ఐరోపా దేశాల్లో, నాటక కళ గ్రీకు నాటక కళనించి నేర్చుకొని వృద్ధి పొందింది. నాటకం అంటే కొన్ని పాత్రలు కొంచెం సేపు, రంగస్థలంమీద మాట్లాడుకొని వెళ్ళిపోవటం కాదుగదా. పాత్రల ప్రవేశ నిష్క్రమణాలూ, రంగస్థలంమీద మాట్లాడుకొని వెళ్ళిపోవటం కాదుగదా. పాత్రల ప్రవేశ నిష్క్రమణాలూ, రంగస్థలం మీద వాటి ప్రవర్తన, సంభాషణలకీ సంచరణానికీ సమన్వయం, ఇదంతా అయింతరవాత, చూసిన వాడిక అందించదలచుకొన్న అనుభూతి అందిందా లేదా అన్నది ముఖ్యం. సామాజికులు తయారు కారు. ప్రదర్శించటానికి మంచి నాటకాలు యేనీలేవు. పెళ్ళికుదిరతేగాని పిచ్చి కుదరదు. పిచ్చికుదిరితేగాని పెళ్ళి కుదరదు. మరి పరిష్కారం యేమిటంటే-రంగస్థలంమీదికెక్కి సామాజికుల్ని రంజింపజేసిన సంస్కృతనాటకాలూ, గ్రీకు నాటకాలూ, తక్కిన పాశ్చాత్య నాటకాలూ, వాటి పథకం చెక్కుచెదరనివ్వకుండా, తెలుగు నుడికారంతోవున్న సుంభాషణలతో ప్రదర్శించి, సామాజికులకి నాటకాభిరుచి కలిగేటట్లు చెయ్యాలి. సామాజికులు తయారయితే నాటకాలు వాటంతట అవే ఉద్భవిస్తాయి అని చెప్పే వారు మేష్టారు. నాటకాన్ని గురించి వారి అభిప్రాయాలు ఒకనాడు చెప్పినవికావు. కొన్ని సంవత్సరాలలో అప్పుడప్పుడు చెప్పినవి ఒకచోట చేర్చాను.

నాటకాన్ని గురించి మేష్టారి అభిప్రాయాలు ఆకళించుకున్న తరవాత నాకు An Enemy of the People తెలుగు చేద్దామనే ఆలోచన వచ్చింది. ఆ మాట మేష్టారితో చెబితే, వారెప్పుడో ''ప్రజానిరోధి'' అనే పేరుతో తెలుగు చేశామని చెప్పి ప్రాతప్రతి నాకు యిచ్చారు. ఆ నాటకంలో అన్నదమ్ములు చైర్మనుకీ డాక్టరుకీ రామవర్మ లక్ష్మణవర్మ అనే పేరుతో, అక్కడక్కడో చాలాకొద్ది మార్పులతో తెలగుచేశారు. నా చిరకాలమిత్రులు శ్రీ భానుప్రకాశ్ గారు ప్రదర్శిస్తారనే ఉద్దేశంతో ఆ పుస్తకం తీసుకున్నారు. కారణాంతరాలవల్ల ప్రదర్శించే ప్రయత్నం జరగలేదు. పుస్తకం తిరిగి యివ్వలేదు. ఆ విధంగా, ఉన్న ఒక్క ప్రతీ పోయింది. అది మరొక రూపంలో మరొకరి పేరుతో వెలువడుతుందేమో. లేక అప్పుడే వెలువడ్డదో.

1961 మే నెలలో తిరుపతిలో సభలు జరిపి, నన్నయ పదప్రయోగకోశం విడుదల చేశారు. ఆ సభలకి నాకూ ఆహ్వానం వచ్చింది. శ్వశురగృహంనించి తిరుపతి వెళదా మనుకున్నవాణ్ణి, నూతనదార సంగ్రహం కావటంవల్ల వెళ్ళలేకపోయాను. మేష్టారు తిరిగి వచ్చిన తరవాత నేను కలుసుకున్నప్పుడు 'నువ్వు సభలకి రాలేదు. నిన్ను అక్కడ అందరికీ పరిచయం చేద్దామనుకున్నాను' అన్నారు.

1962 చివర్లో యెప్పుడో, తిక్కన పదప్రయోగకోశం (సూచి అనే మాట విడిచి పెట్టేశారు) పని మొదలు పెట్టారు. అప్పటికి మేష్టారు ఒక్కరూ మకాం హైదరాబాదుకి మార్చారు. వారి కుమారుడు శ్రీ గోపాలకృష్ణగారితో చిక్కడపల్లిలో వుంటూ వుండేవారు. తిక్కన పదప్రయోగకోశం పని చెయ్యటానికి నన్ను హైదరాబాదు రమ్మన్నారు మేష్టారు 1963 మార్చిలో నేను సికింద్రా

బాదులో దిగి, చిక్కడపల్లి వెళ్ళాను. రోడ్డుమీద అన్ని షాపులు చూసి, అది చిక్కడపల్లి అంటే నమ్మలేకపోయాను. 1952, 53లో నారాయణగూడా వంతెనకీ, ముషీరాబాదు పోస్టాఫీసుకీ మధ్య రోడ్డుమీద అన్ని షాపులుగాని, యిళ్ళు గాని లేవు. మేష్టారున్న యిల్లు కనుక్కొని వెళ్ళాను. గోపాలకృష్ణగార్ని కలుసుకోవటం అప్పుడే. ఆ రోజు సాయంకాలం, ఆంధ్ర సారస్వత పరిషత్తు భవనాల్లో వున్న అకాడమీకి మేష్టారూ నేను వెళ్ళాం. అప్పటికి డా. భద్రిరాజు కృష్ణమూర్తి గారు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్ర విభాగానికి అధిపతిగా వున్నారు. తిక్కన పదప్రయోగకోశ సంపాదకవర్గం-రామకృష్ణారావుగారూ, కృష్ణమూర్తిగారు, దివాకర్ల వేంకటావధాని గారు, నేను హైదరాబాదు చేరిన మర్నాడో మూడో రోజో, తిక్కన పద ప్రయోగకోశం పనిచేసేవాళ్ళ సమావేశం జరిగింది. సంపాదకులు ముగ్గురూ తమతో పనిచేసేవాళ్ళని పరిచయం చేశారు. కృష్ణమూర్తిగారి ఆదేశంతో పనిచేసేవాళ్ళు, అరడజనుమంది పి.హెచ్.డి. విద్యార్థులూ, లెక్చరర్లూ, అవధానిగారి ఆదేశంతో పనిచేసేవాళ్ళు మరో అరడజనుమంది, పి.హెచ్.డి. లు, లెక్చరర్లు, మేష్టారివంతు మూడోవంతు పని చెయ్యటానికి నేనొక్కణ్ణి. వచ్చిన పండితుల్లో మరొక యిద్దర్నో ముగ్గుర్నో తీసుకోమన్నారు మేష్టార్ని. మేష్టారు వద్దన్నారు. 'నా వంతుపని రామానుజాచార్యులు ఒక్కడే చేస్తాడు. ఈయన రోజంతా యిదేపని చేస్తాడు గనక, తక్కివాళ్ళు అయిదారుగురు తీరుబడి వేళతో చేసేపనికి సరిపోతుంది అన్నారు. ఆ పండితులకి కృష్ణమూరితోనూ, అవధానిగారితోనూ యూనివర్సిటీలో పనిపడుతుంది గనక, వారు అప్పజెప్పిన పని శ్రద్ధగా చేస్తారుగాని, మేష్టారితో వాళ్ళకి యెవళ్ళకీ యేమీ అవసరం వుండదు గనక వాళ్ళు శ్రద్ధగా చేస్తారనే నమ్మకం మేష్టారికి లేదు. అప్పటికే రాసి పెట్టివుంచిన ఆరోపాలకార్డులు సరిచూడటం పని. ఆపని చేసిన వాళ్ళ పేర్లు తిక్కన పదప్రయోగకోశంలో రాయలేదు. అందరిపేర్లూ నాకు గుర్తు లేవు. డా. తంగిరాల వేంకట నారాయణ శాస్త్రిగారి పేరూ, డా. అమరేశం రాజేశ్వరశర్మగారి పేరూ నాకు గుర్తు వున్నాయి. నారాయణశాస్త్రిగారితో వాల్తేరులోనే పరిచయం వుంది.

డా. నారాయణశాస్త్రిగారు సంస్కృతాంధ్రాలలో పండితులు. చక్కటి దస్తూరి. వారు రాసిన కార్డులు నేను పరిశీలించాను. కార్డులు రాసిన వారందరిలోనూ శాస్త్రిగారే బాగారాశారు. ఆరోపమూ, ప్రయోగమూ పర్వ, అశ్వాస, గద్యపద్య సంఖ్యలూ తీర్చి దిద్దినట్టు రాశారు. వారు ఉద్యోగపర్వంలో నాలుగో అశ్వాసంలో పద్యం అన్వయంలో పొరపాటుపడ్డారు. అది వారి పొరపాటు కాదు. బహుజనపల్లి సీతారామాచార్యులుగారి పొరపాటు. బహుజనపల్లి వారిది పొరపాటు అని అనుకోలేకపోవటం వల్ల శాస్త్రిగారు పొరపాటు పడ్డారు.

''అమర సైన్యములును దమయంత వర్తింపనేరకునికి నా కుమారు మొగము నొనర్పవలసెగాదె సమస్తసేనలను నీవ యరసి నడువవలయు.

శబ్దరత్నాకరంలో ''మారు-దే.వి. ప్రతి'' అని అర్థంయిచ్చి, పై పద్యం ప్రయోగం యిచ్చారు. శబ్దరత్నాకరంలో యిచ్చిన అర్థం తప్పనీ, వారు చేసిన అన్వయంకుదరదనీ నాకు అంతకుముందే తెలిసివుండటంవల్ల శాస్త్రిగారు చేసిన పొరపాటు వెంటనే కనుక్కున్నాను. ఆ కార్డులు మేష్టారికి చూపించి, శబ్దరత్నాక

రంలో తప్పు కూడా తీసి చూపించాను. ''ఆ కుమారు మొగముగా నొనర్పవలసె గాదె'' అని అన్వయం చెప్పాను. ఆ సాయంకాలం శాస్త్రిగారు వచ్చినప్పుడు ఆయనకి చూపిస్తే, సహృదయతతో తమ పొరపాటు అంగీకరించారు. ''తలచుట్టు వార కన్నులు గలిగిన పద్యంబు తప్పుగా దనవశమే'' అనే నా స్వభావాన్ని మేష్టారు నువ్వెంత వాడివి అని అణచివెయ్యకుండా ప్రోత్సహించారని చెప్పటానికి ఈ ఉదంతం.

తిక్కన పదప్రయోగకోశం ఆరోపాలు సరిచూసేపని అయిదు నెలల్లో పూర్తి అయింది. నేను తిరిగి విశాఖపట్టణం వెళ్ళిపోయిన తరవాత, మేష్టారు అకాడమీ తోను తిక్కన పదప్రయోగకోశంతోనూ, సంబంధం వొదులుకున్నారు.

1965 చివర్లో నేను విశాఖపట్టణంలో ఉద్యోగం వొదిలిపెట్టి, హైదరాబాదులో మరొక ఉద్యోగంలో చేరాను. అప్పుడు మేష్టారు మలకపేటలో వుండే వారు. ఎప్పుడైన శనివారమో, ఆదివారమో వారింటికి వెళ్ళి వస్తూండేవాణ్ణి. ఆ తరవాత రెండు మూడేళ్ళలో నాకు తెలుగు యం.ఏ. పరీక్షకి వెళదామని కుతూహలం కలిగింది. ఏ యూనివర్సిటీ వారైనా నన్ను పరీక్ష రాయనిస్తారో లేదో తెలుసుకోకుండానే, నా ఉద్దేశం మేష్టారికి చెప్పాను. ''యం.ఏ. ప్యాసయితే మీ ఆఫీసులో ప్రమోషను యిస్తారా?'' అని అడిగారు. 'ఏమీ యివ్వరు' అని చెప్పాను. అప్పుడు చెప్పారు వెలకట్టటానికి వీల్లేని సలహా. ''నీకు వొచ్చినంత తెలుగు వొచ్చును. నీకు తెలుగొచ్చునని యెవడూ సర్టిఫికెట్ యివ్వక్కర్లేదు. ఇప్పుడు చేసుకుంటున్న పర్చేజ్ డిపార్టు మెంటు ఉద్యోగమే చేసుకుంటూ వుండు. ఏవో నాలుగు ఇంగ్లీషు ముక్కలు గిలికితే, నీప్రైవాడు అల్లాకాదు, యిల్లా రాయ మంటే, యిల్లాగే రాయి. ఆ జీతం రాళ్ళు తెచ్చుకోని కాలం వెళ్ళదియ్యి. అంతేగాని, యెప్పుడూ తెలుగుకి సంబంధించిన వుద్యోగం యేదీ చెయ్యకు. నీప్రైవాడు యేదో చెబితే, వాడికి తెలియదని నువ్వు చెప్పాల్సి వస్తుంది. దానితో పేచీ. నీకు రోజులు గడవటం దుర్భరమైపోతుంది. యం.ఏ. పరీక్షా వొద్దు, యేమీ వద్దు'' అని చెప్పారు. అంతటితో ఆ ఆలోచన పూర్తిగా మానుకున్నాను. మా గురువు గారు యిల్లాగ సలహాయిచ్చారని, తోటి వాళ్ళతో యిప్పుడెప్పుడైనా చెబితే, వీళ్ళంతా 'చాలా అమూల్యమైన సలహా' అని మెచ్చుకుంటున్నారు.

1973-74 ప్రాంతాలలో మేష్టారు మలక్‌పేటలో వుండగానే నారచనలు కొన్ని తీసుకువెళ్ళి చదివి వినిపించాను. అంతకు మునుపు యెప్పుడూ నేను రాసిన వేవీ వారికి చూపలేదు. ''అజ్ఞాన సర్వస్వం'' అనే పేరుతో వచనగేయాల సంకలనం తయారు దేద్దామని నాలుగైదు రాశాను. అవి చదవగా విన్న తరవాత నాకొక హితం చెప్పారు. వచనం గేయం అనేదే వారు అంగీకరించలేదు. ఛందస్సు లేనిదే మాటలకూర్పు గుర్తుపెట్టుకోవటం సాధ్యంకాదు గనక యేదో ఒక Rythm వుండాలి. ఈ వచనగేయం రాసినవాడు కూడా రెండు పంక్తులకన్నా యెక్కువ గుర్తుపెట్టుకుని మళ్ళీ చెప్పలేడు. నువ్వు చెప్పేది ఫరవాలేదుగాని, యేం చెప్పినా యేదో ఒక ఛందస్సు, Rythm ఉండే టట్టు చెప్పమని హితం చెప్పారు. తరవాత నా ''అజ్ఞాన సర్వస్వం'' ముందుకు సాగలేదు.

ఆ రోజుల్లోనే ఒకసారి మేష్టారితో ''విశ్వనాథ సత్యనారాయణగారికి, శ్రీరంగం శ్రీనివాసరావుగారికీ ఉన్న

అజ్ఞానం మీకు లేకపోవటంవల్ల మీరు యేమీ రాయలేక పోతున్నారనుకుంటాను'' అన్నాను. మేష్టారు వెంటనే నవ్వి'' 1937 దాకా ఆంధ్రసాహిత్యం నన్ను నడిపించింది. ఆ తరవాత నేను ఆంధ్ర సాహిత్యాన్ని నడిపిస్తున్నాను'' అంటున్నాడు శ్రీశ్రీ. యెంత అజ్ఞానమో చూడు' అని తమ 'కవిత' లోనించి

''అజ్ఞాతాజ్ఞేయాలకు అజ్ఞానంతో నేస్తం''

అన్న పంక్తిని ఉట్టంకించారు. మానవ జాతి తరతరాలుగా పోగు చేసుకున్న అజ్ఞానం అజ్ఞాతాల చుట్టూ, అంతకు మించి అజ్ఞేయాల చుట్టూ అల్లుకున్నది. ఆనాడు మేష్టారికి లేదన్న ''అజ్ఞానం'' (అప్పట్లో నాకూ లేనిది) నన్ను ఆవరించడం వల్ల యిప్పుడు నేను రాస్తున్నాను.

(అబ్బూరి సోదరుల సౌజన్యంతో)

Printed, Published and Edited by
Shri ALAPATI RAVINDRANATH for and at
Kala Jyothi Process Pvt. Ltd. 1-1-60/5,
Iftekar Mansion Lane, R.T.C. X Roads,
Musheerabad, Hyderabad-500 020.

Phone: 67148/66909.
Grams: CARDI CAP.
Telex: 0425-2043 NAAP IN

# AN ADVANCED TECHNOLOGY FOR AN IMPROVED QUALITY OF LIFE

NATCO

NATCO FINE PHARMACEUTICALS PVT. LTD.
Regd off: 1-10/12, Ashoknagar, Hyderabad-500 020.